


## 'ఫీల్ గుడ్' కథ

ఎ.రాజరాజేశ్వరి

# వియ్యాల వారి నెయ్యాలు

"అమ్మా.. శైలజని చూశావు కదా! నచ్చిందా నీకు" కొడుకు ప్రశ్నలోని అంతరార్థం అవగతమైన ఆమె పెదవుల మీద చిరునవ్వు ప్రత్యక్షమైంది.

"శైలజంటే... ఆ రోజు మనం షాపుకెళితే, నీ కొలీగంటూ పరిచయం చేశావు. తెల్లగా, సన్నగా, పెద్ద తలకట్టుతో బాపుబొమ్మలా.. అందంగా నాజూకుగా ఉందీ.." తల్లి మాటకు అడ్డం పడకపోతే, ఇంకా అలా వర్ణిస్తూనే ఉంటుందనుకున్న సంజయ్, మధ్యలో ఆమె మాటను కట్ చేస్తూ "అ.. అ.. ఆ అమ్మాయే! పేరు శైలజ. నా కొలీగ్. మా ఆఫీసులో చేరి ఆరు నెలలయింది. మనవాళ్లే. వాళ్లది విజయవాడ. పేరెంట్స్ ఇద్దరూ లెక్చరర్లు. ఈమె అన్నయ్య ఆ ఊర్లోనే బ్యాంకులో ఆఫీసరు. అదీ వాళ్ల ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండు" అన్నాడు పాఠంలా అప్పజెపుతూ.

నాన్‌స్టాప్‌గా కొడుకు చెప్పిన సారాంశాన్ని విని చిన్నగా నిట్టూర్చింది కామేశ్వరి. "నాకర్థమయిందిరా, నిన్ను ప్రేమ దోమ కుట్టిందని ఈ వంక పెట్టుకుని, మన సాంప్రదాయ పద్ధతులు కాదని, తూ.తూ.. మంత్రంలా పెళ్లి చేసేస్తామంటే కుదరదు. మాకు నువ్వు ఒక్కడివే కొడుకువి. అంతా పద్ధతిగా జరగాలి...ఇక్కడ చూడడం అయిపోయింది పెళ్లిచూపులు అవీ.. లేదంటే కుదరదు. ఆ అమ్మాయికి చెప్పు వాళ్ల వాళ్లు మమ్మల్ని పెళ్లిచూపులకు ఆహ్వానించి, పిల్లను చూశాకా కట్నకానుకలు, లాంఛనాలు అన్నీ మన మర్యాదకు తక్కువ కాకుండా జరగాలి. అలా అయితేనే ఆ అమ్మాయి ఈ ఇంటి కోడలవుతుంది"

తల్లి మనస్తత్వం, పట్టుదల తెలిసిన అతను కొంచెం దిగులుపడుతూ తలూపాడు. తనతో సమానంగా చదువుకొని ఉద్యోగం చేస్తున్న అమ్మాయిని పెద్దల ప్రోద్బలంతో కట్నాలు, కానుకలు అంటూ బేరాలు పెడితే, పెద్దల ఆశలు కొన్నేళ్ల వరకే కానీ, కలకాలం కాపురం చేసే తమ మధ్య డబ్బు అడ్డుగోడలా నిలుస్తుంది. నా విలువను రూపాయలతో పోలుస్తావా! అని శైలజ నిలదీస్తే?

శైలజ తన కొలీగ్‌గా పరిచయం అయిన రోజు నుండే ఆమె అంటే అభిమానం, ఇష్టం ఏర్పడ్డాయి. తను ఆమెకి సీనియర్ కావడాన, వర్కు విషయంలో ఆమెకి చాలా హెల్పు చేశాడు. తన పట్ల ఆమెకున్న సాఫ్ట్‌కార్నర్ గమనించి, తన అభిప్రాయాన్ని చూచాయగా చెపితే, ఆమె వ్యతిరేకించకపోవటంతో తన తల్లిని పరిచయం చేస్తానని శైలజను షాప్‌కి రమ్మన్నాడు.

ఆ అమ్మాయి అణకువ, అందం అన్నీ కామేశ్వరికి బాగా నచ్చాయి. తను చూడడం లేదనుకొని, ఇద్దరూ దొంగ చూపులు చూసుకోవడం ఆమె దృష్టిని దాటిపోలేదు. అతి తొందరలోనే ఆమెతో పెళ్లి ప్రస్తావన తీసుకొస్తాడని తెలిసి, ఆ టైం రాగానే తన దాబు, దర్పాన్ని ప్రదర్శించింది.

ఆ రోజు శనివారం, సంజయ్‌కి శలవు. తీరికగా కూర్చుని టిఫిన్ తింటున్నాడు. అతడి తండ్రి రవీంద్ర ఆఫీసుకి వెళ్లే హడావిడిలో ఉండి, షూస్ వేసుకుంటున్నాడు. ఫోన్ మోగుతుంటే కామేశ్వరి రిసీవ్ చేసుకుంది.

అవతల నుండీ "ఇది రవీంద్రగారి ఇల్లాండీ?" అని అడుగుతున్నారు. "అవునండీ! మీరెవరు?" అంది కామేశ్వరి.

"నా పేరు రామశాస్త్రి. మాది విజయవాడ. మా అమ్మాయి పేరు శైలజ. మీ అబ్బాయి పెళ్లికి ఉన్నాడని తెలిసి, మా అమ్మాయిని చూసుకోవడానికి పెళ్లిచూపులకు ఆహ్వానిస్తున్నాం"

"ఒక్క నిముషం ఆగండి" అని రిసీవరు రవీంద్రకిచ్చింది.

"ఎవరో శాస్త్రిగారట. విజయవాడ నుండీ చేస్తున్నారు. వివరాలు కనుక్కోండి" అని చెప్పింది.

అవతలి నుండీ పరిచయాలు అయ్యాకా వివరాలు, అడ్రస్ పేపరు మీద రాసుకొని, ఫోను పెట్టేశాకా విప్పారిన మొహంతో చెప్పాడు. "రేపు మంచి రోజు. వాళ్లమ్మాయిని చూడడానికి విజయవాడ రమ్మంటున్నారు. రేపు ఉదయాన్నే బయలుదేరి వెళ్లి సాయంత్రం వెనక్కు వచ్చేద్దాం" అన్నాడు.

భర్త నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో రేపటి ప్రయాణానికి కావల్సిన తినుబండారాలు, పెళ్లికొడుకు తల్లిగా తనెలాంటి చీర కట్టుకోవాలో, నగలు పెట్టుకోవాలో తేల్చుకుని, వాటిని అమర్చుకునే హడావిడిలో పడింది.

ఆ మరునాడు ఉదయం కారులో విజయవాడకి బయలుదేరారు. లంచ్ టైంకి అక్కడికి చేరుకుని, ఏదయినా హోటల్లో భోజనం చేసేసి, పెళ్లివారింటికెళ్లి పిల్లను చూసేస్తే, ఎలాగూ కొడుకు మెచ్చిన అమ్మాయే కాబట్టి, మిగిలిన ఫార్మాలిటీస్.. కట్నకానుకలు వగైరాలు మాట్లాడేసుకుందామని అనుకున్నారు.

అయితే విజయవాడలో ఎంటరయ్యాకా ఒక విషయం తెలిసి నిరాశపడిపోయారు.

గవర్నమెంటు పెట్టిన అడ్డగోలు రూల్సు వలన కడుపు మండిన హోటలియర్సు, మెస్సుల వాళ్లతో సహా బంద్ పాటిస్తూ తమ వ్యాపారాన్ని స్తంభింపచేశారు. ఎక్కడో ఒకటీ అరా రహస్యంగా తెరచి ఉంచినా అవి తమ స్థాయికి తగ్గవి కావు.

ముందు చూపుగా తమతో తెచ్చుకున్న బిస్కట్లు, పళ్లు తినేసి ఆకలి చల్లార్చుకున్నారు.

కామేశ్వరి ఊరిని, షాపులను కళ్లు విప్పార్చుకొని చూస్తూ ఏవో పాత జ్ఞాపకాలు కంటి ముందు ఆవిష్కరించడానికి ప్రయత్నిస్తోంది.

ఎప్పుడో నలభై సంవత్సరాల క్రితం తన పన్నెండేళ్ల వయసులో తండ్రికి బదిలీ అయి, ఈ ఊరొచ్చారు. ఎనిమిదో క్లాసు ఇక్కడే చదివింది. అప్పటికీ ఇప్పటికీ ఈ ఊరు ఎలా మారిపోయిందంటే, తన కళ్లను తనే నమ్మలేకుండా ఉంది.

పెళ్లివారిల్లు దగ్గర పడడంతో భార్యను చేత్తో తట్టి పిలిచాడు. తన ఆలోచనలకు స్వస్తి చెప్పి, సరిగ్గా సద్దుకొని కూర్చుంది.

ఆడపెళ్లివారు తమ కోసమే ఎదురుచూస్తూ హాలులో కూర్చుని ఉన్నారు. వీరిని చూసి ఎదురేగి ఆహ్వానించారు.


హాలులో ఖరీదయిన సోఫాసెట్టు, టీవీ, ఇంటీరియర్ డెకరేషన్‌తో కళాత్మకంగా ఉంది. వారి స్థితిగతులు గమనించిన కామేశ్వరి సంతృప్తిగా తలాడించింది.

"నమస్కారమండీ! నా పేరు జానకి. నేను శైలజ తల్లిని" అంది ఆవిడ పరిచయం చేసుకుంటూ.

ఆవిడ మొహంలోని చిరునవ్వు పెట్టని నగలా మెరుస్తోంది. కామేశ్వరి ఆవిడ అందాన్ని మెచ్చుకుంటూనే ప్రతి నమస్కారం చేసింది.

"ఈ రోజు రెస్టారెంట్లన్నీ బందున్నాయి. ఇది

లంచ్‌టైం కదా! లేవండి భోజనం చేసి, కాసేపు రెస్టు తీసుకున్నాకా అమ్మాయిని చూద్దురు గానీ" అంది జానకి చొరవగా.



కామేశ్వరి అయిష్టంగా తలూపి "వద్దండీ! పెద్దలెందుకన్నారో తెలియదు 'కతికితే అతకదని'. ఏదో అల్పాహారాల వరకూ అయితే ఫరవా లేదుకానీ, భోజనాలు వద్దు" అంది.

ఆమె రవీంద్ర వైపు ఒకసారి పరిశీలనగా చూసి అడిగింది. "మీరు రవీంద్రగారు కదూ! మిమ్మల్నిక్కడ.. చూడడం చాలా ఆశ్చర్యంగా ఉంది"

రవీంద్ర ఆమె వైపు ఆసక్తిగా చూశాడు. 'ఎవరీమె? తనని పేరు పెట్టి పలకరిస్తోంది' అనుకుంటూ ఆమె మొహంలోకి ఒక నిముషం తదేకంగా చూసి, ఆమెను గుర్తుపట్టిన అతడికి సంతోషంతో మతిపోయింది.

"నువ్వా..జానకీ! ఇక్కడున్నావేమిటి?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఇది మా ఇల్లు. శైలజ మా అమ్మాయి. నువ్వు లోపలికి రాగానే గుర్తు పట్టాను. ఎంతయినా మగ పెళ్లివారు కదా! అడిగితే ఏమనుకుంటావోనని ఇంతసేపు ఆగాను" అంది చిరునవ్వుతో.

రవీంద్రకి తన కాలేజీ జ్ఞాపకాలు ముసురుకున్నాయి.

సౌమ్యంగా, సాత్వికంగా ఉండే జానకి తనకి జూనియర్. ఎవరికి ఏ అవసరం వచ్చినా, వారు అడగకపోయినా నేనున్నానంటూ ఆదుకొనేది. ఆమె అంటే ప్రతి ఒక్కరికీ అభిమానమే!

అనుకోకుండా, తనే ఆమె నుండీ సహాయం పొంది, మృత్యువు అంచుల నుండీ బయటపడ్డాడు. కాలేజీకి వస్తుంటే రాంగ్ సైడులో వచ్చిన స్కూటరువాడు తనకి డాషిచ్చి, హిట్ అండ్ రన్ కేసుగా పారిపోయాడు.

అందరూ చోద్యం చూస్తూ నిల్చున్నారే కానీ, పోలీసు కేసని ఒక్కరు కూడా పట్టించుకోలేదు. రక్తం మడుగులో పడున్న తనని జానకి హాస్పిటల్‌లో జాయిన్ చేయడమే కాక, తనకి రక్తదానం చేసి ప్రాణ భిక్ష పెట్టింది.

ఆ క్షణంలో సాక్షాత్తూ ఆమెలో తల్లి, చెల్లి కనిపించి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

ఆ తర్వాత వాళ్ల నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ కావడంతో చదువు మధ్యలో ఉండగానే వేరే ఊరికి వెళ్లిపోయింది. ఆమెను మళ్లీ ఇప్పుడే చూడడం.

తన ప్రాణదాత ఇంటికి వియ్యంకుడి హోదాలో రావడం సంభ్రమాశ్చర్యాలలో ముంచి, తను వచ్చిన పని కూడా మరచి ఆమెతో కబుర్లలో పడ్డాడు.

సంజయ్ తన తండ్రి వైపొకసారి ఆశ్చర్యంగా చూసి, తన ఫ్రెండు ఫోన్ చేయడంతో మాట్లాడుతూ కూర్చోవడంతో అనుకోని ఈ మలుపుకి కామేశ్వరి అటూ ఇటూ దిక్కులు చూస్తూ కూర్చుంది.

ఆమె దృష్టి ఫ్రేము కట్టి గోడకు వేలాడదీసున్న ఒక ఫోటో మీద ఆగిపోయి, కళ్లు ఆశ్చర్యంతో వెడల్పయి, నమ్మశక్యం అనిపించక, ఆ ఫోటోకి దగ్గరగా వెళ్లి దాన్ని, మూలగా ఉన్న పొట్టి సంతకాన్ని పరికించి చూసింది.

ఒక్క ఉదుటున గిర్రున తిరిగి, తననే పరిశీలనగా చూస్తున్న పెళ్లికూతురి తండ్రిని సమీపించి, "శాస్త్రీ.. నువ్వా.. రామేశ్వర శాస్త్రివి కదూ!" అంటూ ఉద్విగ్నంగా అరిచింది.

అప్పటి వరకూ మనసులో ఉన్న సందేహం తీరిపోవడంతో "నువ్వా.. కాముడివి కదూ!" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఈయన నీకు తెలుసా!" అంటూ రవీంద్ర, సంజయ్ ఒక్కసారే అడిగారు.

"నలభయి ఏళ్ల పరిచయం మాది. నా చిన్ననాటి స్నేహితుడు. ఒక ఏడాది మేమీ ఊర్లో ఉన్నామని

చెప్పాను కదా! ఈ శాస్త్రి వాళ్లు మా పక్క వాటాలో ఉండేవారు. ఇతడికి అన్నయ్యలున్నారు కానీ, అక్కచెల్లెళ్లు ఎవరూ లేరు. ఏ ముహూర్తంలో కలిశామో కానీ, మా ఇద్దరి మధ్యా ప్రాణస్నేహమేర్పడింది. ఎప్పుడు చూసినా ఇద్దరం ఒక్క చోటనే ఉండేవారం. ఆటలు, కబుర్లతో మాకు కాలమే తెలిసేది కాదు. వీళ్లమ్మగారయితే నన్ను తెలియని వారికి తన కూతురనే చెప్పేవారు.

ఇద్దరం క్యారమ్స్ ఆడుకోవడం, కథల పుస్తకాలు పోటీపడి చదవడం, వచ్చే పోయే వారిని నిక్ నేమ్స్ పెట్టి ఏడిపించడం బాగా కాలక్షేపంగా ఉండేది. మా పెరట్లో పెద్ద బాదం చెట్టు ఉండేది. స్కూలుకెళ్లే ఆ కాస్త సమయం తప్ప, మిగిలిన టైమంతా ఆ బాదం చెట్టు కిందకి చేరి కాకులు, ఉడతలు కొట్టిపడేసిన బాదం కాయలు ఏరుకునే వాళ్లం.

ఇంట్లో పెద్దవాళ్ల కంట పడకుండా చెట్టెక్కడమో, మేడమీదకెళ్లి అందినంత మేర బాదం కాయలు పోగేసి పప్పు కొట్టుకొని తినేవాళ్లం. స్వీటు చేద్దామంటూ వచ్చీరాని ప్రయోగాలు చేసి తిట్లు తినేవాళ్లం.

అప్పట్లో నాకు సాహిత్యం పిచ్చి ఎంతగా ఉండేదంటే, కనపడ్డ ప్రతి పుస్తకం చదవడమే కాదు తెలిసీ, తెలియని భాషా పాండిత్యంతో కాగితాల మీద పిచ్చి పిచ్చి అయిడియాలతో కథలుగా రాసేదాన్ని.

అవన్నీ చదివి వినిపిస్తే, అతడు విరగబడి నవ్వేవాడు. నాకు ఉక్రోషం వచ్చి కలబడితే 'సరదాకి నవ్వాను. బాగా రాస్తావు ప్రయత్నించు' అని ఓదార్చేవాడు.

ఒకసారి తోచక కొండలు, సెలయేరు, అందులో పడవలు, ఆకాశం, పక్షులు, ఒక పక్కగా కొబ్బరిచెట్టు ఊహాచిత్రంగా గీశాను. అది ఇతడికిమ్మని అడిగితే, రంగు లేసి, ఇదుగో మూలగా కాముడు అని తారీకుతో సహా పొట్టి సంతకం చేసి ఇచ్చాను.

ఆ తర్వాత నాన్నగారికి బదిలీ అయి వేరే చోటకి వెళ్లిపోయినా చాలా సంవత్సరాలు క్షేమ సమాచారాలు ఉత్తరాలు రాసుకోవడం, ప్రతి రాఖీ పండుగకి నేను రాఖీ పంపడం చేసేదాన్ని. పెళ్లయి పోయాకా బద్ధకం కొంత, కాల మహిమ, కొంత కమ్యూనికేషన్ గ్యాప్ వచ్చేసి, మా అనుబంధం జ్ఞాపకాల పొరల్లోకి వెళ్లిపోయింది. మన పిల్లల పుణ్యమా అని ఇక్కడికి రావడం, నేను వేసిచ్చిన పెయింటింగ్‌ని ఇంత భద్రంగా ఫ్రేమ్ కట్టించి దాచిపెట్టడం వలన నేను శాస్త్రిని గుర్తుపట్టగలిగాను"

గతాన్ని గుర్తు చేసుకున్న ఆమె కళ్ల నుంచి నీరు భావోద్వేగం వలన దారగా ప్రవహిస్తోంది. శాస్త్రి పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే ఉంది.

జానకి తేరుకుంది. "అయితే ఇకనేం! ఇప్పుడు పెళ్లివారిగా కాక, మా ఇంటి ఆడపడుచుగా భోజనం చేసి తీరిగ్గా అమ్మాయిని చూడండి" అంది.

కామేశ్వరికి గాల్లో తేలుతున్నట్లుంది. "ఇది నా పుట్టిల్లు. భోజనం చేయమని వేరే చెప్పాలా! అసలే ఆకలేస్తోంది. వడ్డించొదినా!" అంది.

"మరి అమ్మాయిని చూడాలి కదా!" అన్నాడు రవీంద్ర భార్యకున్న పట్టింపులు తెలిసి.

ఆమె ఒక్క క్షణం గతుక్కుమని "ఏం ఫరవాలేదులే. శైలజ ఎవరమ్మాయో, తెలిసిన క్షణాన్నే నా కోడలయిపోయింది. నో ఫార్మాలిటీస్. ఇక మనం నిశ్చితార్థం చేసుకొని ముహూర్తాలు పెట్టుకోవడమే" అంది.

సంజయ్ చాలా తేలికగా నిట్టూర్చాడు. తమ తల్లితండ్రులు ఒకరికొకరు బాగా ఇష్టులు కావడంతో, ఇక తమ మధ్య వాలంటరీగా తప్ప, బలవంతపు కానుకలు, కట్నాల సమస్య రాదు. నిన్న సాయంత్రం పెళ్లి వారితో తాము అడగాల్సిన కానుకలు, లాంఛనాలు రాసుకున్నారు. బహుశా వాటి అవసరం రాకపోవచ్చును.

సంజయ్ చూపులు శైలజ కోసం వెతికాయి. అది గమనించిన కామేశ్వరి "ఇదిగో వదినా! పెళ్లిచూపులు క్యాన్సిలయిపోయాయి. మీ అమ్మాయినిలా వచ్చేయమను" అంది నవ్వుతూ.

తెల్లబోయిన జానకి, కామేశ్వరి నవ్వు చూసి "భయం లేదులే వదినా! మా అమ్మాయిని కట్నకానుకలతోనే పంపిస్తాం అది మీకు నచ్చినా, మానినా మీ ఇంటి కోడలిగా స్వీకరిస్తే మన మధ్య అనుబంధం మరింత గట్టిపడుతుంది" అంటూ హాస్యమాడింది.

కామేశ్వరి పెద్దగా నవ్వింది. "మీ కూతురు మా ఇంటి కోడలిగా రావడమే మాకు పెద్ద కానుక. మాకు మళ్లీ వేరే కట్నం దేనికి?" అని తన బ్యాగు తెరచి తాము రాసి పెట్టుకున్న కోరికల లిస్టుని బయటికి తీసి, చింపేసి అక్కడున్న డస్ట్‌బిన్‌లో పడేసి, తన చర్యకు సంతోషపడుతున్న కొడుకు వైపు ప్రశాంతంగా చూసింది.

అన్నం తింటూ అడిగింది. "పెద్దమ్మ ఎలా ఉన్నారు? ఎక్కడున్నారు?" అంటూ.

"అమ్మ నా దగ్గరే ఉంటోంది. పెద్దదయిపోయింది కదా! త్వరగా భోజనం చేసి, కాసేపు పడుకొని లేస్తుంది. మా శైలు అత్తగారివి నువ్వని తెలిస్తే చాలా సంతోషపడుతుంది" అన్నాడు శాస్త్రి.

అందరూ కలసి నవ్వుకుంటూ భోజనాలు చేస్తుంటే, ఆ సందడికి శాస్త్రి తల్లి నిద్ర లేచి అక్కడికొచ్చింది.

"ఏమే.. జానకీ! పెళ్లిచూపులయిపోయాయా? అంతా కలిసి తింటున్నారు. కతికితే అతకదంటారు..." అని ఇంకా ఏదో చెప్పబోతున్న తల్లితో శాస్త్రి సంబరంగా చెప్పాడు.

"మన శైలూ.. కాబోయే అత్తగారు ఎవరనుకున్నావు? మన పక్కింటి కాముడు. నీ పెంపుడు కూతురు" అన్నాడు.

ఆవిడ కామేశ్వరిని త్వరగానే గుర్తు పట్టి "నువ్వటే.. కాముడూ? బాగున్నావా!" అంది ఆనందంగా చూస్తూ.

"బాగున్నాను పెద్దమ్మా! అన్నం తిన్నాకా మాట్లాడుకుందాం" అంది కామేశ్వరి.

వాళ్లంతా ఒకే కుటుంబంలా కలిసిపోయి నవ్వులతో, కేరింతలతో గడుపుతూ ఉంటే "వియ్యాలవారి కయ్యాలను, వారి మధ్య నలిగిపోయే పిల్లలను చూశాను. కానీ వియ్యాలవారి నెయ్యాల వలన ఇల్లంతా ఇప్పుడే ఇంత సందడిగా ఉంది. ఇక పెళ్లికి ఎలా ఉంటుందో..?" అనుకుంటున్న ఆవిడ మాటలకు వాళ్లంతా నవ్వులతోనే సమాధానమిచ్చారు.

